

(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

-187-

(29 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

ఇటీవల ఆంధ్రప్రభ మేనేజరు గారు మాట్లాడుతూ, 'జ్యోతిషాలలో తమాషాలు ఎప్పుడన్నా వ్రాశారా' దరహం మీద జ్యోతిషశాస్త్రం గొప్పదే. కాని దాన్ని ప్రతి చిన్న విషయానికీ సాగదీయడం మంచిది కాదు అన్నారు.

అక్కడ వున్న జ్యోతిషశాస్త్రవేత్తలు "ఎల్లం రాజువారు అలా అంటారేమిటి? గంట గంటకీ, ప్రతీ విషయానికీ గ్రహస్థితి చూసుకునేవారున్నారు. మధ్యాహ్నం రెండు గంటలవరకు ఇలా గడిచింది. మూడు తర్వాత ఎలా వుంటుందో చూసుకోవాలి అని తాపత్రయపడేవారెంతమందో వుంటారు" అన్నారు

అలాంటివారు నాకు చాలామంది తెలుసు. వారి శాస్త్ర వ్యామోహం ఎంతో వింతగా, విచిత్రంగా ఉంటుంది. ఒకసారి బంధువుల యింటికి వెళ్ళాను. ఇల్లాలు ప్రొద్దునపూట ఇడ్లీలు, పచ్చడి చేస్తోంది. త్వరగా ప్రసాదం పెడదామనే ఆసక్తితో ఇంతలో కొంచెం కారం చింది కంట్లో పడింది "అబ్బా" అని కేకలు పెట్టింది.

అవతలి గదిలో వున్న భర్త "ఏమిటి ఏమిటీ ఏం జరిగింది? అంటూ లోపలికి పరుగెత్తుకు వచ్చాడు. కంట్లో కారం పడిందని చెప్పింది. ఆయన వెంటనే ఇలా అన్నాడు "అయిందీ.. కంట్లో కారంపడింది. ఆ సంగతి నాకు ముందే తెలుసు. ఇవాళ ఏదో ఒక చిన్న ప్రమాదం జరుగుతుందని. గ్రహబలం సరిగ్గా లేదు. ఇవ్వాళ నువ్వు కొంచెం జాగ్రత్తగా వుండాలని చెపుదామనుకున్నాను. కొయ్యల జోలికి, బండల జోలికీ వెళ్ళడం ఈ రోజు మానేస్తే ఎంత బాగుండేది. బండ చప్పుడు వినిపించగానేనైనా పరుగెత్తుకు వచ్చి చెప్పాను కాదూ. అలా చెప్పనియ్యదు గ్రహబలం. అనుభవించవలసిందే. ఆవిరి పెట్టినా దాని ఉధృతం తగ్గదు. వంటిగంట దాకా వుంటుంది ఆ మంట. అప్పటికి కాని గ్రహాలు మళ్ళీ మంచిస్థితికి రావు" అని ఆయన శాస్త్ర సమీక్ష చేశారు గాని జాలి పడలేదు. కన్ను ఏ తడిబట్టతోనో తుడిపించలేదు. శాస్త్ర పరిజ్ఞానానికి ఒక చక్కటి ప్రయోగం లభించిన సంతోషం పొందాడు లోలోపల.

వాషింగ్‌కు వేసిన జేబు రుమాలా రాలేదని ఒక ఇల్లాలు పోట్లాడుతోంది దోబీతో. అప్పుడే యింటికి వచ్చిన భర్త ఆ సంభాషణ విని, "పోట్లాడతావెందుకే అతనెంత జాగ్రత్త తీసుకున్నా అది ఈ వారంలో పోయి తీరేది. అసలు లెక్క ప్రకారం

పంచో, చీరో పోవలసింది గ్రహతీక్షణ కొంచెం బాగుండటం వల్ల చిన్నదాంతో పోయింది. చూడు తారాబలాలు ఒకసారి ఫలానా జాతకులకు ఈ వారంలో వస్తు నష్టం తప్పదు. గ్రహబలం మంచిది కనుక కొద్ది తరహా నష్టమే సంభవిస్తుంది. పై వారంలో తారాబలం బాగుంది గనుక పోయిన వస్తువు దొరికే అవకాశం వుంది అని వ్రాశారు కనుక, పై వుతుకులో తప్పక దొరుకుతుంది. వృధాగా పోట్లాడకు" అన్నాడాయన.

దోబీ పకపకలాడుతూ బయటికి పోయాడు. ఆమె రుసరుసలాడుతూ రూములోకి పోయింది.

ఒక గృహస్తు అరకిలో దోసకాయలు తెచ్చాడుట పప్పు వండించుకుని తిందామని. ఆ రాత్రికి పులుసుకుకూర వండించుకు తిందామని అరకిలో బీరకాయలు తెచ్చాడట. తీరా తరిగితే దోసకాయలన్నీ చేదైనాయట.

"అనుకున్నంత పనీ అయింది. అసలు ఈ రోజు నా చేత్తో కూరలు తేకూడదు తారాబలం ఏమీ బాగుండలేదు. తెలిసే పరిగెత్తాను. కర్మ."

"పోనీ బీరకాయలు తరిగి పప్పు చెయ్యి దోషం వాటిక్కూడా కొట్టి తీరాలి. ఒకే దుష్ట ఘడియలో కొన్నవేగా? అవి తియ్యటి కాయలే అయినా మన సంచిలోకి వచ్చేటప్పటికి కటిక చేదు అయి తీరాలి తప్పదు" అన్నాడట.

తీరా తరిగి చూస్తే అవి కూడా చేదయిపోయాయి.

ఆయన వెంటనే అన్నాడట "నీది పిచ్చిగాని శాస్త్రం ఊరికే పోతుందటే ఇరవై పైసలు బీరకాయలు ఇవి పోవడమొక లెక్కా.. ఈ రోజు అమృతం తెచ్చి యింట్లో పెట్టినా హాలాహలమై పోతుంది కాయగూరల కేం.. శాస్త్రం ఘనత నిల్చిపోయింది. ఈ పూటకి ఏ చింతకాయ పచ్చడో చేసి, ఇంత పులుసు పెట్టు ముందు ముందు నా జాతకం బాగుండని రోజున చెపుతూ వుంటాను. కూరలు నువ్వెళ్ళి పట్టుకొస్తూ వుండు" అన్నాడుట.

"అయితే, ఇవ్వాళ మీ విషయంలో అంతా చేదే నంటారా" అందిట భార్య ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"అంతే కావాలంటే తీసుకొస్తా. తారాబలం చూపిస్తావుండు నీకు నమ్మకం లేకపోవడం నా ప్రారబ్దం. నువ్వసలు కిలాడివి. నీకు భర్త మీద అభిమానం లేదు" అని మొదలు పెట్టాడుట.

"ఈరోజు చేదుమాట నమ్మానండీ. ఇంకా సందేహిస్తానా? చేదు కూరల్లోకి వచ్చిందంటే నమ్మలేదు. మాటల్లో కూడా వచ్చిన తర్వాత నమ్మకుండా వుంటానా సరే, చింతకాయ పచ్చడి చేసి పులుసు పెడతా మీరేదైనా పనివుంటే చూసుకోండి" అన్నదట భార్యామణి.

వెనుకటికి ఎవడో అన్నాడుట "కలిసి వస్తుందన్న రోజునే కన్నం వేశాను. అయినా ఖైదు తప్పలేదు కలిసివచ్చిందల్లా సంపాదించకుండా త్రాగుతున్నా ఈ గంజి నీళ్ళూ" అని.

ఒకసారి నేనూ ఒక మిత్రుడూ ఏదో ఊరు వెడదామని బయలు దేరాము. గుర్రపు బండిమీద స్టేషనుకు వెడుతున్నాం. త్రోవలో బండి బోల్తా పడింది. పచ్చగడ్డితో సహా మేమిద్దరం ఎగిరివెళ్ళి రోడ్డు ప్రక్కన పడ్డాం. ఎవరో వచ్చి

లేవదీశారు. పదిమందీ చేరి "దెబ్బలు తగిలాయా? ఎలా పడ్డారు? ఏ ఊరు వెళుతున్నారు? అదృష్టవంతులు అంటూ ఇలా ఏవేవో అనేస్తున్నారు.

మా మిత్రుడు పచ్చగడ్డిలోనో కూర్చుని వున్నాడు. నెత్తిమీద పరకలు కూడా దులుపుకోలా. నవ్వుతూ అన్నాడు. "మనం ఆరు గంటల బండికి బయలుదేరవలసింది. పొరపాటున మూడు గంటలకు బయలుదేరాం. అయిందింటిదాకా నా గ్రహబలం బాగుండలా? ఆ మాట మరచిపోయా మన ప్రయాణం ఆరుగంటలకే ఇంటికి వెడదాం" పద అని.

"ఆరు గంటలూ లేదు, అరవై ఆరు గంటలూ లేదు. ఇక్కడికి బ్రతికి బయట పడ్డాం ఇంటికి పోదాం" అన్నాను.

"అబ్బే? ఆరుగంటలకు సుఖంగా ప్రయాణం చేయవచ్చు. అప్పుడు చాలా బాగుంది గ్రహబలం. ఇప్పుడైనా అంగారకుడు మంచి స్థానంలో వుండటం వల్ల పచ్చగడ్డిలో పడ్డాం మెత్తగా? లేకపోతే కటికి నేలమీద పడేవాళ్ళం బుర్రలు ఖంగున మ్రోగేవి" అన్నాడు మా మిత్రుడు.

అప్పుడు మాత్రం నాకు అనిపించింది."ఈ గ్రహవీక్షణంలో కొంచెం మార్పులు కూడా వుంటాయి గావన్ను." అని పచ్చిగడ్డిలాంటి మెత్తలు పరుస్తాయి గావన్ను. ఇదీ కొంత అదృష్టమే అని.

ఒక యువకుడు ప్రక్క యింటి అమ్మాయి మీద అదే పనిగా చూపులు పారబొయ్యడం ప్రారంభించాడట. ఒకరోజు ఆ అమ్మాయి సిగ్గుపడి తప్పుకుందిట.

"బైటికి రావాలి సుమా అన్నట్లుగా" ఈలలు వేయడం ప్రారంభించాడుట. అది అమ్మాయి అన్నగారు విని పరుగెత్తికు వచ్చి –

"ఏమిటి ఈ పిచ్చి వేషాలు? రోజూ మొద్దు వెధవలాగ పడివుండేవాడివి. ఇవ్వాళ ఇంత దమ్ము ఎలా వచ్చింది?" అని ఒక్క చెంపకాయ కొట్టాడుట.

దాంతో వాడి మెడ మెలికలు తిరిగి, "ధైర్యం నా అంతట నాకు రాలేదు. తారాబలంలో వుంది 'స్త్రీలతో సరస సల్లాపాలు' " అని అన్నాడట.

"తారాబలం చూచి ఇలా తలతిక్క వేషాలకు దిగావా? ఎక్కడ చదివావో అక్కడ ఆ వాక్యం కొట్టివేసి "పురుషునితో దవడ శుద్ది అని వ్రాసుకో" అని ఆ పిల్ల అన్నగారు వెళ్ళిపోయాడట.

జాతకాల్లో ఇలాంటి తమాషాలు వుంటాయి. కొంతమందికి ఈ చాదస్తం వెంటాడుతూనే వుంటుంది.

Post your comments